క్లుప్తంగా

ఊబకాయంతో అనర్థాలు



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శీరిషా

రొంపిచెర్ల: ఊబకాయం వల్ల అనేక అనర్థాలు వుంటాయని, దాన్ని తగ్గించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష తెలిపారు. ఆమె బుధవారం చిచ్చిలివారిపల్లె పంచాయతీ లోకవారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉండాలన్నారు. బరువు పెరిగితే అనేక వ్యాధులు వస్తాయని వివరించారు. మనం తినే ఆహారంలో నూనెలు, చక్కెర తదితరాలను తగ్గించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త దీప, హెల్పర్ జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఘనంగా దసరా పండుగ



దసరా పండుగను జరుపుకుంటున్న పోలీసులు

రొంపిచెర్ల: స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం పోలీసులు దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. పోలీసు స్టేషన్‌ను నీటితో శుభ్రం పూలతో అలంకరించారు. ఆయుధాలకు పూజలు చేశారు. పోలీసు స్టేషన్‌లో ప్రతి ఏటా దసరా పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



సదుం: పౌష్టికారాన్ని పంపిణీ చేస్తున్న మల్లీశ్వరి

సదుం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి తెలిపారు. ఆమె బుధవారం భట్టువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, చిరు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి

పెద్దపంజాణి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో బాలాజి, డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వారు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని సమన్వయం చేసుకుని క్రమం తప్పకుండా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని సూచించారు. పైపులైన్లు లీకేజీలను అరికట్టి తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

పలమనేరు: ఈ నెల 18 నుంచి చెకుముకి టాలెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జేవీవీ కార్యదర్శి యుగంధర్‌బాబు తెలిపారు. ఆయన బుధవారం ఆ సంఘం సభ్యులతో కలిసి పలమనేరులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు పాఠశాల స్థాయిలో ఈ నెల 18న, మండలస్థాయిలో నవంబరు 1న, జిల్లా స్థాయిలో నవంబరు 23న రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. పిల్లల్లో సైన్సుపై మక్కువ పెంచేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు.

రెచ్చిపోతున్న బియ్యం స్మగ్లర్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో అక్రమ వ్యాపారాలు జోరందుకున్నాయి. కూటమి నేతలు ఇసుక, మట్టి, గ్రావెల్‌ను టిప్పర్లు, లారీల ద్వారా కర్ణాటకకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పుడు కొందరు కూటమి నేతల అండతో తమిళనాడు రేషన్ బియ్యాన్ని పలమనేరు నియోజకవర్గం మీదుగా బంగారుపేటకు రవాణా చేస్తున్నారు. స్మగ్లర్లలో విభేదాలు నెలకొని రెండు వర్గాలుగా చీలిపోవడంతో వారే అధికారులకు సమాచారం ఇచ్చి సరుకు పట్టిస్తున్నట్టు తెలిసింది. ఇందులో కూటమి నేతలు కీలకంగా వుండడం వల్లే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అరగొండలోని ఓ గోడౌన్‌లో నిల్వ ఉన్న బియ్యం(ఫైల్)

- యథేచ్ఛగా బంగారుపేటకు బియ్యం అక్రమ రవాణా
- కీలక సూత్రధారి అరగొండకు చెందిన స్మగ్లర్
- రెండు వర్గాలుగా చీలిన వైనం
- అక్రమార్కులకు కూటమి నేతల అండ

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు సరిహద్దులో వుంటుంది. కొన్ని కిలోమీటర్లు ప్రయాణిస్తే ఇటు కర్ణాటక, అటు తమిళనాడులోకి చేరుకోవచ్చు. దీన్ని ఆసరాగా తీసుకున్న కూటమి నేతలు అక్రమ వ్యాపారాలు యథేచ్ఛగా చేస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి కర్ణాటకలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇందులో మండల కేంద్రమైన గంగవరానికి చెందిన ఒక వ్యక్తి, పలమనేరుకు చెందిన మరో ముగ్గురు కీలకంగా వున్నట్టు సమాచారం. వీరు తమిళ బియ్యాన్ని సేకరించి బంగారుపేటకు నేరుగా గాని, లేకుంటే బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన ఒక వ్యక్తికి గాని విక్రయిస్తున్నారు. వీరు కాకుండా గతంలో ఇదే వ్యాపారంలో ఆరితేరిన పెద్ద స్మగ్లర్ సోదరులు ఇద్దరితోపాటు భాను అనే కీలక వ్యక్తి కూడా బియ్యాన్ని చేరవేస్తున్నట్టు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్ద డాన్‌గా మారిన అరగొండ కిరణ్ అనే వ్యక్తి తన ద్వారానే మొత్తం వ్యవహారం నడవాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. అందులో భాగంగానే పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లికి చెందిన స్మగ్లర్లను అధికారులకు పట్టించాలని పథకం పన్నినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇటీవల జీడీనెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం వద్ద పలమనేరుకు చెందిన ఒక యువకుడు, అతని డ్రైవర్‌ను తిరువళ్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టించినట్టు తెలిసింది. వారు బెయిల్‌పై బయటికి వచ్చిన తర్వాత పలమనేరుకు చెందిన భాను ద్వారా మరో ఇద్దరు స్మగ్లర్లతో కలిసి అరగొండకు చెందిన కిరణ్ డీల్ చేసుకుని అక్రమ రవాణా చేస్తున్నట్టు సమాచారం.

ఎవరీ అరగొండ కిరణ్..

అరగొండ కిరణ్ అనే వ్యక్తి తన 30వ ఏటనుంచే బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్టు సమాచారం. ఏకంగా తన ఇంట్లోనే భారీ గోడౌన్ ఏర్పాటు చేసుకున్నట్టు స్థానిక స్మగ్లర్లు చెబుతున్నారు. అతను జిల్లాలోని పడమటి మండలాల్లోని ఇతర స్మగ్లర్లను తన దారిలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. మాట వినని వారి బండ్లను అధికారులకు పట్టించి జైలుకు పంపుతున్నాడు. దీన్ని బట్టి చూస్తే ఇతనికి ఉమ్మడి చిత్తూరు జిల్లా, తమిళనాడులోని ఎన్‌ఫోర్స్‌మెంట్, పీడీఎస్ అధికారుల సహకారం ఏ రేంజిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

లోడుకు రూ.40 వేలు లాభం...

తమిళనాడు ప్రభుత్వం పేదలకు ఉప్పుడు బియ్యాన్ని ఉచితంగా ఇస్తోంది. కొందరు ఏజెంట్లు కార్డుదారుల నుంచి కిలో రూ.16 చొప్పున కొనుగోలు చేసి ఇక్కడి స్మగ్లర్లకు రూ.18లకు అమ్ముతున్నారు. కర్ణాటకలోని బంగారుపేటలో రూ.24లు పలుకుతోంది. ఈ క్రమంలో స్మగ్లర్లు రహస్యంగా టెంపోలు, లారీల్లో బంగారుపేటకు చేరువేస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు కిలోకు రూ.2 పోయినా రూ.4 మిగులుతోంది. ఆ లెక్కన పది టన్నులకు రూ.40 వేలు లాభం. అందువల్లే ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి నిత్యం పదికి పైగా వాహనాలు బంగారుపేటకు బియ్యాన్ని తరలిస్తున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాలశాఖ అధికారులు, స్పెషల్ బ్రాంచి పోలీసులు నిఘా పెట్టి అక్రమ వ్యాపారాలను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.



తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో సేకరించిన ఉప్పుడు బియ్యం



ఇటీవల తమిళనాడు అధికారులు పట్టుకున్న పలమనేరు స్మగ్లర్ల టెంపో(ఫైల్)

మండలంలో కుండపోత వర్షం



గంగవరం : ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువు మొరవ

గంగవరం: మండలంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడంతో నదులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. కౌండిన్య నదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలకు కొత్తగా వేసిన వరి, పలు రకాల పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళి



రామప్పకు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని ముమ్మిడేర్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రామప్ప బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గ్రామానికి చేరుకున్నారు. రామప్ప మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్మూర్తి నాయుడు, ఎంపీటీసీ మంజునాథ్,, శివకుమార్, భక్త, సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి

పుంగనూరు: మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పొలెంపల్లె విజయ్‌కుమార్‌రెడ్డి కుమారుడు నరసింహారెడ్డి(32) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి బుధవారం పొలెంపల్లెకు చేరుకున్నారు. నరసింహారెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కొండవీటి నాగభూషణం, వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తదితరులు ఉన్నారు.

ఎర్రాతివారిపల్లెలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పర్యటన





సదుం: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంట ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటరు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ఎర్రాతివారిపల్లెలో పర్యటించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఇంట జరిగిన శుభకార్యంలో పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు సదుమమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను పలువురు స్థానికులు కలిసి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రేణుకమ్మ, పెద్దిరెడ్డి నిహాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, పుంగనూరు ఎంపీపీ భాస్కర్ రెడ్డి, చౌడేపల్లె జెడ్పీటీసీ దామోదర రాజు, తిమ్మారెడ్డి, నాగరాజారెడ్డి, హబీబ్, రెడ్డెప్పరెడ్డి, ఇమ్రాన్, మనోహర్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గంగవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో చేపట్టిన వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో అండర్- 17 బాలుర విభాగంలో గంగవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విన్నర్స్‌గా, మామడుగు విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచినట్టు ఎంఈవో-1 వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అలాగే అండర్ 14 విభాగంలో పొన్నమాకులపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విన్నర్స్‌గా, దండపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-17 బాలికల విభాగంలో పత్తికొండ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విన్నర్స్‌గా, కొత్తపల్లె పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్ 14 బాలికల విభాగంలో కీలపట్ల పాఠశాల విద్యార్థులు విన్నర్లుగా, కొత్తపల్లి పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు మెడల్స్, బహుమతులు అందజేశారు.

సెల్‌ఫోన్ మోజులో పడి చదువును నిర్లక్ష్యం చేయద్దు



మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు: పిల్లలు సెల్‌ఫోన్ మోజులో పడి చదువును నిర్లక్ష్యం చేయొద్దని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని గూడూరుపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం హెడ్‌మాస్టర్ మహేష్‌నారాయణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువ మంది విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగిస్తున్నారని తెలిపారు. చాలా మంది సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వినియోగిస్తూ సమయానికి నిద్ర, ఆహారం తీసుకోవడం లేదన్నారు. చదువును కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు భవిష్యత్తు నాశనం అవుతుందని వివరించారు.

గాలిలో కలుస్తున్న ప్రాణాలు





రోడ్డు పక్కన బోల్తా పడిన టిప్పర్ (ఫైల్), ప్రమాదంపై విచారిస్తున్న పోలీసులు (ఫైల్)

- జాతీయ రహదారిలో పెరిగిన ప్రమాదాలు
- ఇప్పటికే ఏడుగురు మృతి
- నివారణ చర్యలు తీసుకోని అధికారులు

రొంపిచెర్ల: తిరుపతి – మదనపల్లె జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. ఆరు నెలల్లో మట్లోళ్లపల్లె నుంచి రాజువారిపల్లె వరకు జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతిచెందారు. 10 రోజుల క్రితం మూరేవాండ్లపల్లె, రామచంద్రాపురంకాలనీ, పిచ్చిగుంట్లవారిపల్లె గ్రామాలకు చెందిన కూలీలు టమాటా తోటల్లో పని చేసేందుకు అన్నమయ్య జిల్లా కలకడకు ఆటోలో వెళుతున్నారు. జాతీయ రహదారిలో ఆటో ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరో 10 మంది గాయపడ్డారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు క్షతగాత్రులు తెలిపారు. అలాగే బోనంవారిపల్లె నుంచి పీలేరు వెళ్లడానికి పెద్దగొట్టిగల్లు సర్కిల్ అండర్ పాస్ నుంచి ఎడమ వైపు రోడ్డు మీదకు తిరగాల్సివుంది. డ్రైవర్ కుడి వైపు రోడ్డు మీద వాహనాలకు ఎదురు వెళ్లడంతో ప్రమాదం జరిగింది. అలాగే రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో అండర్ పాస్ లేకపోవడం వల్ల ఒక వ్యక్తి నడుచుకుంటూ రోడ్డు దాటేందుకు ప్రయత్నించాడు. వేగంగా వచ్చిన కారు అతన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ రోడ్డులో అవసరమైన చోట అండర్ పాస్‌లు, బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో అండర్ పాస్ ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను పలు మార్లు కోరినా ఫలితం లేదు. దీంతో ప్రజలు రోడ్డుపైనే నిలబడి బస్సులు ఎక్కాల్సి వస్తోంది. ప్రమాదం జరిగి ప్రజలు మృత్యువాత పడితే గాని స్పందించరా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్‌పై దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు మాట్లాడుతూ ఎవరైనా న్యాయ వ్యవస్థను కించపరిచేలా వ్యవహరిస్తే చట్టపరంగా శిక్షించాలన్నారు.

పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఆల్తాఫ్‌బాషా

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఆల్తాఫ్‌బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు డిపోలో చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎం టీకే స్వామి కుప్పానికి బదిలీ అయ్యారు. ఆల్తాఫ్ బాషా మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

11న ఉచిత మెగా వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం)/చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలలో ఈ నెల 11న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి తెలిపారు. ఆమె బుధవారం ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ క్యాంపులో పలువురు స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని అన్ని రకాల పరీక్షలు చేస్తారని వెల్లడించారు. వైద్య శిబిరంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా పీవీకేఎన్‌లో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి విలేకరులతో మాట్లాడూ ఉచిత వైద్య శిబిరానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు పెద్ద చల్లారగుంట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రవికుమార్ తెలిపారు. ఆయన బుధవారం విద్యార్థులతోపాటు పీడీ మోహన్‌కుమార్‌ను అభినందించారు. ఆయన మాట్లాడుతూ గంగవరం మండలం కేటిల్‌ఫారం ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ – 19 విభాగంలో మీనా 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలోనూ, వాకింగ్‌లో భరత్ ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు.

దేవదొడ్డిలో లోపించిన పారిశుద్ధ్యం





దేవదొడ్డిలో వీధిలోనే నిలిచిన వర్షపునీరు, మురుగు కాలువ వద్ద వేపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

బైరెడ్డిపల్లె : మండలంలోని దేవదొడ్డిలో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపైనే వర్షపు నీరు నిలుస్తోంది. కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెందడంతోపాటు దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. విషజ్వరాలు ప్రబలక ముందే కాలువలను శుభ్రం చేయడంతోపాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిండిన చెరువులు



మొరవెత్తుతున్న వైఎస్సార్ జలాశయం



భారీగా ప్రవహిస్తున్న కౌండిన్య నది





పరవళ్లు తొక్కుతున్న కళ్యాణిరేవులు జలపాతం, హోరెత్తుతున్న గంగనశిరస్సు వాటర్ పాల్స్

- కౌండిన్య నది పరవళ్లు!
- నిండుకుండలా వైఎస్సార్ జలాశయం
- ప్రవహిస్తున్న గంగన శిరస్సు, కల్యాణిరేవులు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు కర్ణాటకతోపాటు ఎగువ ప్రాంతాలైన సోమల, పెద్దపంజాణి మండలాల నుంచి వరద నీరు వస్తుండడంతో కౌండిన్య నది పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని పలు చెరువులు నిండి మొరవలు పారుతున్నాయి. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. మండలంలోని కాలువపల్లి వద్దనున్న వైఎస్సార్ జలాశయం పూర్తిగా నిండి మొరవపోతోంది. పలమనేరు మండలంలోని కల్యాణరేవులు, గంగన శిరస్సు పాల్స్ నీటితో కళకళలాడుతున్నాయి. అలాగే మండలంలోని బొమ్మిదొడ్డి, నక్కపల్లి, బేలుపల్లి, ఎస్పురంలోని వడ్డెవానికుంట, గొల్లపల్లి బుచ్చిరెడ్డి కుంట, ఎర్రగొండేపల్లి, గంగారపూర్ చిన్నచెరువు మొరవలు పారుతున్నాయి. కొలమాసనపల్లి, మొరం, కరిడిమొడుగు తదితర చెరువులకు వరద నీరు భారీగా చేరుతోంది. నేడో రేపో నిండిపోయి మొరవలు పారే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలోని బూదాలవంక, చిన్నేరు, ఎరిగినేరు, కాలువపల్లి ఏర్లు నీటి ప్రవాహాన్ని సంతరించుకున్నాయి. నియోజకవర్గంలోని పలుచోట్ల బుధవారం కూడా వర్షం కురిసింది. బైరెడ్డిపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది.